# నాన్నగారి స్నేహితుడు

గేట్వే ఆఫిండియా!

పాముల్ని ఆడించేవాడొకడు - పావురాల కోసం సజ్జలు అమ్మేవాడొకడు. గారడి విన్యాసాలు చూడమని కొందరు - రంగురంగు ఫోటోలు తీస్తామని ఇంకొందరు. కొబ్బరి బొండాల గలగలలు - వేరుశెనగ కాయల చిటపటలు - ఓవైపు ప్రభుత్వ పర్యాటక శాఖ వారి ఆర్భాటం - మరోవేపు ప్రైవేటు టూరిజం వాళ్ల కోలాహలం - కనిపిస్తే చాలు తారతమ్యాలు లేకుండా వెంటపడే ముష్టివాళ్లు. బాలివుడ్ తారైనా - హాలీవుడ్ టూరిస్టైనా పట్టించుకునే తీరికలేని హడావుడి ప్రజానీకం - ఆగే లాంచీలు - సాగే లాంచీలు - 'గేట్వే ఆఫిండియా దేశానికి ముఖద్వారమో కాదో కాని భారతదేశ జీవనానికి అద్దం సుమా' - అనుకుంటూ ఇవి ఏవీ మనసుని తాకని ఆత్రుత - ఆరాటంతో వున్న లలితకి "ఇదిగో" అంటూ రెండు లాంచి టికెట్స్ అందించాడు రాజు.

గబగబ నడుస్తున్న లలిత వెంట నడిచి వెళ్లి లాంచి ఎక్కాడు రాజు.

లాంచి తీరం వదిలి ఎలిఫెంటా కేవ్స్ వేపు వెళుతుంటే లలిత 'ఇంకా వేగంగా వెళ్లకూడదూ?' ఆత్రంగా అనుకుంది.

లలితతో ఉత్సాహంగా కబుర్లు చెపుతున్న రాజు ఆమె పరధ్యానాన్ని గమనించి "ఏంటాలోచిస్తున్నావ్?" అనడిగాడు.

"ఒంటిగంటౌతుంది కదా. లంచ్‌కి తనక్కడే వుంటాడా? ఎటైనా వెళతాడా?" అనడిగింది.

"ఎక్కడికి వెళ్లినా లంచ్ టైమ్ అయిపోగానే సీట్‌లోకి రావాలికదా" అన్నాడతను.

సముద్రాన్ని చూస్తూ ఇంకా ఇంకా కబుర్లు చెప్పాలని వున్నా, ఆమె మనఃస్థితి

తెలిసిన రాజా మౌనంగా చుట్టూ చూస్తూ కూర్చున్నాడు.

"ఇంకాసేపట్లో ఎలిఫెంటా కేవ్స్‌కి చేరబోతున్నాం. ఈ లాంచి ఒడ్డు వరకు వెళ్లదు. ఇందులోంచి మరో చిన్న పడవలోకి మనం మారాలి. ఆ పడవ ఒడ్డుకి చేర్తుంది. కొండపై కోతులుంటాయి. మీ మీ వస్తువులు జాగ్రత్త. ఇక్కడ సరిగ్గా ఓ గంట ఆగుతుంది. గంటవ్వగానే మీరంతా కొండ దిగి ఒడ్డుకి వచ్చెయ్యాలి" అని వినిపిస్తుంటే లలిత తలతిప్పి చూసింది.

టూరిస్ట్ గైడ్!

లాంచిలో కలకలం చూసి "ఏంటి?" అనడిగింది లలిత.

"మరో పడవలోకి మారాలని చెప్పింది కదామె. పాపం భయపడుతున్నారు" నవ్వుతూ అన్నాడు రాజు.

"నడి సముద్రంలో ఇలాంటి గుండాగే విషయాలు చెప్పకపోతే కాస్త ఆ లాంచి బయలుదేరినప్పుడే చెప్పొచ్చుగా. ఈ వొచ్చిన విదేశీయులే బెంగపడుతుంటే ఈతరాని నాలాంటివాళ్ల గురించేం చెపుతాం" విసుక్కుందామె.

ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకొని కదుల్తున్న లాంచిలోనుండి కదిలే చిన్న పడవలోకి ఒకొక్కరే సాహస గెంతులు గెంతారు. పడవ ఒడ్డుకి వచ్చి ఆగింది. దిగడానికి ఎవ్వరూ ఉత్సాహం చూపనంత బురదగా వుందక్కడ.

"రోజుకి ఇన్నొందలమంది వస్తుంటే ప్లాట్‌ఫామ్ లేకపోవటం ఏమిటో?" చికాకుపడుతూ, కథాకళి, కూచిపూడి అభినయిస్తూ పడవలో అందరికంటే ముందు దిగి వడివడిగా కొండవేపు అడుగు వేసిందామె.

"డబ్బుతో పని. శాంక్షన్ అయింగి ప్లాట్‌ఫామ్ కడతారులే, అటెటూ" అడిగాడు రాజు.

"ఆఁ కనిపించేదేగా వాసు మామయ్య ఆఫీసు" అందామె బోర్డు చూపించి ఉత్సాహంగా.

ఇద్దరూ వెళ్లి వాసు గురించి ఆరాతీస్తే "యిప్పుడిక్కడ కాదు" అంటూ మరో చిరునామా యిచ్చారు.

ఆమె నిట్టూరుస్తూ ఒడ్డువేపు అడుగులేస్తుంటే "పడవ బయలుదేరడానికి ఇంకా టైమ్ వుంది. మనం ఎప్పుడూ చూడలేదుగా, కేవ్స్ చూసొద్దాం" అన్నాడతను.

అతనికి శిల్పం, చిత్రకళ అంటే యిష్టం. వాసు మామయ్యని చూడాలనే ఆత్రుతలో అతని యిష్టాన్ని మర్చిపోయినందుకు నొచ్చుకుంటూ "సారీ" అంది.

గుహలో శివమూర్తుల్ని చూసిన మైమరపునుంచి రాజా పూర్తిగా తేరుకోకముందే లాంచి గేట్వే ఆఫ్ ఇండియాని చేరుకుంది. లాంచిలోంచి ఒక్క దూకు దూకి పబ్లిక్ టెలిఫోన్ దగ్గరికి త్వరత్వరగా నడిచి వాసు ఆఫీసుకి ఫోన్ చేసింది లలిత. లీవ్‌లో వున్నారని, ఇంటి ఎడ్రస్ యిచ్చారు.

"ఇంత దూరమా? చాలా టైమ్ పడుతుంది వెళ్లడానికి. ఎడ్రస్ చూసి అన్నాడతను.

"అయినా వెళదామండి" అందామె.

"ఈ ఎడ్రస్ కాదు. ఇక్కడ కాదు. అక్కడ అంటు నిన్నట్నుంచి తిప్పుతున్నావ్. లీవ్ పెట్టి యింట్లో వుంటారన్న గ్యారెంటీ ఏంటి? మనమింకా అజంతా వెళ్లాలి" అన్నాడతను.

"అజంతా మానేసైనా వెళదామండీ" చప్పున అందామె.

"ఇప్పుడు వాళ్లింటికెళ్లి వెనక్కి రావటం కష్టం. రేపుదయం బయలుదేరి వెళదాం" అన్నాడతను.

"వెనక్కి రావటం ఎందుకు? అక్కడే వుండొచ్చు. అసలు మామయ్య కనీసం నాలుగు రోజులైనా వుండకపోతే వూరుకోడు" అందామె.

"వాళ్లు వూరులో లేకపోతే కష్టం అవుతుంది. రేపే వెళదాం" అంటూ హొటల్‌కి బయలుదేరాడు రాజు. నిరుత్సాహంగా అతన్ననుసరించిందామె.

హొటల్‌కి వచ్చాక "అబ్బా ఏం ఎండో" అంటూ మంచానికి అడ్డంగా కాసేపు పడుకుని "మనం అజంతా మానేసినట్టేనా?" అనడిగింది.

"ఆఁ ఆ రెండ్రోజులు మీ మామయ్య దగ్గర వుందాం" అన్నాడతను.

లలితకి అతనిపై అవ్యాజమైన ప్రేమ ఒక్కసారిగా వుప్పొంగింది.

తన ఆనందం కోసం ఎన్ని కష్టాలైన పడతాడు. అన్ని యిష్టాలని వదులుకుంటాడు. చెప్పాలి రాజుకి చెప్పాలి. వాసు మామయ్య ఎవరో, తనెందుకంత పట్టుబట్టి వెళదాం అంటున్నదో రాజుకి చెప్పాలి అనుకుంటూ "వాసు నాన్నగారి స్నేహితుడు. నాన్నగారు, వాసు, భాస్కర్ క్లాస్‌మేట్స్. స్నేహితులు. నాన్నగారు ఎం.ఏ. చదివే రోజుల్లో నే పుట్టాను. అమ్మమ్మ వాళ్లింటి నుంచి మూడు నెలల పాపగా వున్న నన్ను అమ్మ విజయవాడలో వున్న నాన్నమ్మింటికి తీసుకు వెళ్లింది. సెలవులకి యింటికొచ్చిన నాన్నగారు, వాసు, భాస్కర్ పోటీపడి ఎత్తుకొని తిప్పేవారు. అమ్మా, నాన్న సినిమాకి బయలుదేరితే, "మీరిద్దరూ వెళ్లండి" అంటూ వాసు నన్ను తీసుకొని పరారయ్యేవాడు. బట్టలు తడిపినా ఎత్తుకోడానికి తటపటాయించేవాడు కాదు. నాకోసారి బెజవాడ ఎండదెబ్బ తగిల్తే తల్లడిల్లిపోయాడు. గుఱ్ఱంలా యిల్లంతా మోకాళ్లపై తిరిగేవాడు. కోతిలా ఎగిరేవాడు. ఏనుగమ్మ ఆటలు - కోకిలమ్మ పాటలు - పిల్లిమొగ్గలు - గాలిపటాలు - బొమ్మలాటలు - వూఁ ఒక్కటే తను నాకోసం ఆడని ఆట, పాడని పాట లేదు. కాళేశ్వరరావు మార్కెట్, బ్యారేజ్ అంతా సైకిల్ మీద ముందు కూర్చోబెట్టుకొని తొక్కేవాడు. చిన్నప్పుడు 'గులాబి' అని పలకటం రాక 'గుబాలి' అని అంటుంటే 'గులాబి' అని పలకటం కష్టపడి నేర్పించాడు. పాటలు బాగా పాడతాడు. లలిత రాగం అంటే యిష్టం. తనకి నాపై వున్న ప్రేమకి మురిసిపోయి నాకు నాన్నగారు 'లలిత' అని పేరు పెట్టారు. ఇవన్నీ అమ్మ చెప్పింది. నాన్నగారు కూడ చెపుతుండేవారు" రాజుకి వాసు మావయ్య గురించి వివరించిందామె.

"పెద్దయ్యాక ఆ మామయ్యని చూడలేదా?" అడిగాడతను.

"నాకు ఆరేళ్లప్పుడు చూశాను" అందామె.

"ఇప్పుడా మామయ్యని చూడాలంటావు" అడిగాడతను.

"ఆఁ ఇప్పటికీ సంవత్సరానికి ఒకటో రెండో వుత్తరాలు మామయ్య, నాన్నగారు రాసుకుంటుంటారు. నేనంటే మామయ్యకి చాలా ఇష్టం. చాలా సంతోషిస్తాడు. అసలిలా హోటల్లో వున్నందుకు కోప్పడతారు కూడ. ఇంటి అడ్రస్ తెలియలేదని చెప్పాలి" గుండ్రంగా కళ్లు తిప్పుతూ భయం భయంగా అందామె.

అతను ఆమె భయానికి నవ్వాడు.

★ ★ ★

ఓపూట ప్రయాణం చేసి వాసు అపార్ట్‌మెంట్‌కి లలిత, రాజు వచ్చారు. కాలింగ్ బెల్ నొక్కింది.

తలుపు తీసిన వ్యక్తిని చూసి వుక్కిరిబిక్కిరవుతూ "వాసు మామయ్యా" అందామె.

"మీరు ....." అంటూ అయోమయంగా ఆగిపోయాడు.

"నేను లలితని" అందామె.

"ల....లితా?" గుర్తు తెచ్చుకోడానికి అతను ప్రయత్నిస్తుండగా అతని శ్రీమతి మాధురి హాల్లోకి వచ్చింది.

తన పేరు అతనికి గుర్తు లేకపోవటం చూసి కాస్త బాధగా అనిపించినా లలిత తనెవరో చెప్పిందతనికి.

"ఓ రండి.... రండి" అంటూ కాస్త ఆశ్చర్యంగా ఆహ్వానించారిద్దరూ.

రాజు, లలితకి ఎదురుగా వాసు, మాధురి కూర్చున్నారు.

"నాన్నగారు బాగున్నారా? మీ వెడ్డింగ్ కార్డ్ అందింది. మీరిప్పుడు ఎక్కడుంటున్నారు? ఎప్పుడొచ్చారు? ఎందుకొచ్చారు? ఎక్కడుంటున్నారు - ప్రశ్నలు, జవాబులు అయ్యాయి. మాధురి కాఫీ యిచ్చింది. తాగారు.

ఇదేంటి యితను ఆనాటి వాసు మామయ్యేనా? అతను "మీరు" అని మన్నించి మాట్లాడుతుంటే మామయ్యా అని ఈమె చనువుగా పిలవలేకపోయింది. అతను తన పిల్లల గుణగణాలు - చదువు - తెలివితేటల గురించి చెపుతుంటే వెర్రి మొహం వేసుకొని విందామె.

పసితనంలో లలితంటే తనకెంతిష్టమో అనే మాటే అతను ఎత్తలేదు. ఇంతదూరం వచ్చింది ఈ ముక్తసరి పలకరింపుకా? ఆనాటి ముచ్చట్లు చెపుతాడని ఆశించింది. ఆనాటి ఆప్యాయత మరోసారి అనుభవించొచ్చని తలపోసింది. తనకి మామయ్యంటే ఎంతిష్టమో చెప్పాలనుకుంది. తనని చూసి చాలా సంతోషిస్తాడనుకుంది.

ఇదేంటి? ఇలా ఎందుకైంది? అతను ఆనాటి రోజుల్ని మర్చిపోయాడా?

మెల్లిగా "మీరు చిన్నప్పుడు నన్ను చాలా బాగా ఆడించేవారని అమ్మ చెప్పేది" అందామె.

చాలా అసందర్భపు విషయం విన్నట్టు వాసు ముఖం పెట్టి "ఐసీ" అన్నాడు.

లలితకి బాధగా అన్పించి "వెళ్ళిపోతున్నాం" అంటూ సోఫాలోంచి లేచింది.

వచ్చినందుకు వాసు, మాధురి థేంక్స్ చెప్పారు.

"ఎక్కడి కలకలత్తా, ఎక్కడి బొంబాయి? సారీ రాజా యిలాంటివాళ్ల కోసం అజంతా ట్రిప్ కేన్సిల్ చేశాను" కళ్లలో తిరుగుతున్న నీటిని కర్చీఫ్‌తో అద్దుతూ అందామె.

"బాధపడకు" ఓదార్పుగా అన్నాడతను.

"పూర్తిగా మారిపోయాడు. కొత్తగా ఏదోలా వున్నాడు. ఎందుకిలా అయిపోయాడంటావ్?" అయోమయంగా

"ఇరవై ఏళ్ల క్రితం అతను నిన్ను లాలించాడు. ఆడించాడు. పసిపిల్లల్ని ప్రేమించే లక్షణం చాలామందికి వుంటుంది. స్వభావరీత్యా అతను నిన్ను ముద్దు చేశాడు. అప్పటికింకా అతని జీవితంలో భార్యా పిల్లలు లేరు. ఆ తర్వాత అతని జీవితంలోకి భార్యా పిల్లలు వచ్చారు. ఆ ప్రేమ తన ప్రపంచానికి అందించాడు. ఇప్పుడతనికి తన యిల్లు, పిల్లలే అపురూపం. ఇలా చాలామంది వుంటారు. నువ్విలా బాధపడకూడదు. ఎవరి గురించో ఎందుకు? మన విషయమే ఆలోచించు. ఈ రోజు మనం మన స్నేహితుల పిల్లలు ఆదిత్య, మీనాని ఎంతో ముద్దు చేస్తున్నాం. ఓ ఇరవై ఏళ్ల తర్వాత వాళ్లపై మనలో యీనాటి ఫీలింగ్ వుంటుందంటావా? ఆలోచించు" అన్నాడు రాజా.

ఆమె పైకి అన్లేదు. మనసులో అనుకుంది – 'ఒకనాడు ఎంతో అపూర్వంగా కన్పించిన బంధాలు – అనుబంధాలు కాలక్రమంలో జ్ఞాపకాలుగా కూడా మిగలవా?'

*• 1993 •*